# ఎన్నికల ప్రక్రియపై అవగాహన అవసరం


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షిస్తున్న రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా

- రాజకీయ పక్షాలకు సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలి
- ఒక్కో అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ. 40 లక్షలు దాటొద్దు
- నామినేషన్ సమయంలో అభ్యర్థితోపాటు నలుగురికి మాత్రమే అనుమతి
- తూర్పు ఎన్నికల రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్, అక్టోబర్ 27: ఎన్నికల ప్రక్రియపై రాజకీయ పక్షాలకు అవగాహన అవసరమని తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గ్రేటర్ కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం తూర్పు నియోజకవర్గానికి చెందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై రాజకీయ పక్షాలకు అవగాహన ఉండాలన్నారు. నామినేషన్ ప్రక్రియపై ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్ ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. సువిధ పోర్టల్ ద్వారా నామినేషన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నామినేషన్ పత్రాల్లో పేర్కొన్న అన్ని అంశాలను సమగ్రంగా పూర్తి చేయాలని కోరారు. ఖాళీగా వదిలేస్తే నామినేషన్లు తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉందని స్పష్టం చేశారు. నామినేషన్ల అనంతరం ఒక సెట్ జిరాక్స్ కాపీలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వాటిని నామినేషన్లు సమర్పించే సమయంలో అందజేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల గురించి ప్రజలకు కనీస అవగాహన కోసం ఎంసీఎం, సీ నిబంధనలకు లోబడి పోటీ చేసే అభ్యర్థులు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా యాడ్‌ల రూపంలో మూడుసార్లు ప్రచారం చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు ప్రచారంలో ఖర్చు చేసే ప్రతి ఆర్థికపరమైన అంశాన్ని ఎన్నికల ఖర్చులో లెక్కిస్తామన్నారు. ప్రతి అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ. 40 లక్షలకు మించొద్దన్నారు. ఫారం-8లో సూచించిన విధంగా పోలింగ్ ఏజెంట్లకు బ్యాడ్జెస్, గుర్తింపు కార్డులు అందజేస్తామన్నారు. నామినేషన్‌లో తప్పులు దొర్లకుండా ఎన్నికల సంఘం గత ఆగస్టులో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచిన నామినేషన్ టెంప్లేట్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పూరించడం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. నామినేషన్ సమయంలో అభ్యర్థితోపాటు నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఒక్కో అభ్యర్థి రెండు నియోజకవర్గాల్లో మాత్రమే పోటీ చేసే అవకాశం ఉందన్నారు. నాలుగు నామినేషన్ సెట్లను మాత్రమే సమర్పించాలన్నారు. సువిధ, సీ-విజిల్ యాప్, పోస్టల్ బ్యాలెట్ వినియోగం, 12 డీ, పీడబ్ల్యూడీ ఓట్ల రాజకీయ పార్టీలు ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో అదనపు కమిషనర్ అనీసుర్ రషీద్, తహసీల్దార్లు ఇక్బాల్, మాస్టర్ ట్రైనీ సందీప్‌కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు సయ్యద్ ఫైజుల్లా, శ్యామ్, ఆడేపు వెంకటేశ్, మనోహర్ పాల్గొన్నారు.


బొడ్రాయికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్

## ఘనంగా బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన

ఖిలావరంగల్, అక్టోబర్ 27: ఖిలావరంగల్ రోడ్డులో జరుగుతున్న బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనోత్సవాలకు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. శివనగర్ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బొడ్రాయి కమిటీ సభ్యులు ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఖిలావరంగల్‌లో వివిధ కారణాలతో కమ్మగోని వెంకటయ్య, మాటేటి గణేశ్‌బాబు మృతి చెందగా, వారి కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## నేడు రాహుగ్రస్త పాక్షిక చంద్రగ్రహణం

ఖిలావరంగల్, అక్టోబర్ 27: స్వస్తిశ్రీ శోభకృత్ నామ సంవత్సరం అశ్వీయుజ శుద్ధ పూర్ణిమ అశ్విని నక్షత్రం మేషరాశిలో రాహుగ్రస్త పాక్షిక చంద్రగ్రహణం ఏర్పడనుంది. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి 1.05 గంటలకు స్పర్శకాలం, 1.44 గంటలకు మధ్యకాలం, 2.22 గంటలకు మోక్షకాలం. గ్రహణం ఆద్యంత పుణ్యకాలం 1.13 గంటలు. చంద్రగ్రహణం ప్రారంభానికి 9 గంటల ముందు ఆలయాలకు ద్వార బంధనం చేయనున్నారు. జిల్లాలోని ఆలయాలను నేడు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆదివారం ఉదయం 5 గంటల వరకు మూసివేయనున్నారు.

### 'ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏర్పాట్లు'

వరంగల్, అక్టోబర్ 27: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నరకాసుర వధకు ఏర్పాట్లు చేస్తామని గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నరకాసురవధ ఉత్సవ సమితి అధ్యక్షుడు మరుపల్ల రవి నేతృత్వంలో ప్రతినిధుల బృందం కమిషనర్‌ను కలిసి ఉత్సవ ఏర్పాట్లపై వినతిపత్రం అందజేశారు. ఉర్సు రంగలీలా మైదానంలో నిర్వహించనున్న నరకాసురవధకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఉత్సవ సమితి సభ్యులు కనుకుంట్ల రవి, అవునూరి రామ్మూర్తి, వనం కుమార్, మరుపల్ల గౌతం, మాటేటి శ్యామ్, వంగరి సురేశ్, దూడ కొంరెల్లి, అన్న కుమారస్వామి, కుడికాల సాంబశివరావు, తవుటం నర్సింహా, కొమ్ము రాజు ఉన్నారు.

### నేటి ప్రత్యేక గ్రీవెన్‌సెల్ రద్దు

గిర్మాజిపేట, అక్టోబర్ 27: ప్రతినెల నాలుగో శనివారం జిల్లాలోని దివ్యాంగుల కోసం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్‌ను అనివార్య కారణాలతో నేడు రద్దు చేస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం శారద ఒక ప్రకటనలో తెలిపారు. నేడు దివ్యాంగులు కలెక్టరేట్‌కు రావొద్దని ఆమె కోరారు.

## ఎన్నికల నియమావళిపై మీడియా ప్రతినిధులకు శిక్షణ


మీడియా ప్రతినిధులకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్

ఖిలావరంగల్, అక్టోబర్ 27: వరంగల్ డీఆర్డీవో సమావేశ మందిరంలో ఎన్నికల నియమావళిపై మీడియా ప్రతినిధులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఎంసీసీ, ఎంసీఎంసీ, పెయిడ్ న్యూస్, సోషల్ మీడియా తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్ కృష్ణారెడ్డి, కే శ్రీనివాస్, సీపెచ్ శ్రీనివాస్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రకటనలకు ప్రీ సర్టిఫికేషన్ అయిన తదుపరి మాత్రమే ప్రచురణ, పోస్ట్, ప్రసారం చేయాలని సూచించారు. కేబుల్ చానెళ్లు, సోషల్ మీడియాలో ప్రసారమయ్యే, పోస్టు చేసే అన్ని వార్తలూ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూం ఎంసీఎంసీ నిరంతరం పర్యవేక్షిస్తుందన్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, యుట్యూబ్ ద్వారా ప్రచారమయ్యే వార్తలను సోషల్ మీడియా పర్యవేక్షణ బృందం నిత్యం పరిశీలిస్తూ ఎంసీసీ నిబంధనలు అతిక్రమిస్తే సంబంధిత వ్యక్తులు, మీడియాపై ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్‌కు ఒక రోజు ముందు లేదా పోలింగ్ రోజు ఏదైనా ప్రకటన ఇవ్వాల్సి ఉంటే కచ్చితంగా మీడియా సర్టిఫికేషన్ పొందిన తర్వాతే ప్రచురించాలన్నారు. శిక్షణలో జిల్లా మీడియా నోడల్ అధికారి ఆయుబ్ అలీ, జిల్లా ఎంసీఎంసీ నోడల్ అధికారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బీ సంజీవరావు, ఎంసీఎంసీ నోడల్ అధికారి, జీడబ్ల్యూఎంసీ ఉప కమిషనర్ కృష్ణారెడ్డి, ఎంసీఎంసీ సభ్యులు మెండు రవీందర్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

కరీమాబాద్, అక్టోబర్27: ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ నాయకుడు పూల నాగేశ్వర్‌రావును పార్టీ శ్రేణులు పరామర్శించారు. ఉర్సులోని బాధితుడి నివాసంలో శుక్రవారం ఆయనను కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో 42వ డివిజన్ నాయకుడు గుండు పూర్ణచందర్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కన్వీనర్ గడ్డం యుగేందర్ ఉన్నారు.

## లేబర్‌కాలనీ సీబీసీ చర్చి ఎన్నికలు

కాశీబుగ్గ, అక్టోబర్ 27: వరంగల్ 18వ డివిజన్ లేబర్‌కాలనీలోని సీబీసీ చర్చి ఎన్నికలు శుక్రవారం జరిగాయి. 13 పోస్టులకు 48 మంది మూడు ప్యానళ్లుగా పోటీ పడ్డారు. ఆఫీస్ బేరర్ 6 పోస్టులకు 24 మంది, కార్యవర్గ సభ్యులు ఏడింటికి 24 మంది పోటీ పడినట్లు నిర్వాహకులు తెలిపారు. 2021 ఓట్లకు 1483 పోలైనట్లు తెలిసింది. శనివారం ఉదయం ఓట్ల లెక్కింపు చేసి విజేతలను ప్రకటించనున్నారు.

## బాధిత కుటుంబానికి మెపా ఆర్థిక చేయూత

నర్సంపేటరూరల్, అక్టోబర్ 27: ముగ్దుంపురం గ్రామానికి చెందిన ముదిరాజ్ కుల సంఘం సభ్యుడు పెండ్యాల అనిల్ ఇటీవల మృతి చెందాడు. ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) ఆధ్వర్యంలో గురువారం రాత్రి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్, డాక్టర్ గుండం మదన్‌కుమార్, మెపా వ్యవస్థాపక సభ్యులు రేగుల మొగిలి, పెండెం మధుసూదన్, బయ్య అశోక్, రాష్ట్ర కార్యదర్శి బైరబోయిన ఐలేశ్, జిల్లా మాజీ అధ్యక్షుడు బూసాని స్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి సాంబరాజు, పిట్టల రాజు, డివిజన్ అధ్యక్షుడు గోనెల భిక్షపతి పరామర్శించారు. అనంతరం మృతుడి భార్యకు రూ. 25 వేల ఆర్థిక సాయం అందించారు.

## సేంద్రియ సాగుపై అవగాహన ఉండాలి

నర్సంపేటరూరల్, అక్టోబర్ 27: రైతులకు గో ఆధారిత వ్యవసాయంపై పూర్తి అవగాహన ఉండాలని మహర్షి గోశాల ట్రస్టు కార్యదర్శి దుగ్యాల కిషన్‌రావు అన్నారు. కమ్మపల్లిలో దేశవాళీ ఆవుల పెంపకంపై గోపాలమిత్రులకు శుక్రవారం అవగాహన కల్పించారు. పశువుల ఎరువును పంట పొలాల్లో చల్లుకోవాలని, దీంతో భూసారం పెరిగి అధిక దిగుబడి వస్తుందన్నారు. గోపాలమిత్రులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్టు మెంబర్ తేరాల యుగేందర్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ ఎండీ జహంగీర్, జిల్లా అధ్యక్షుడు కుంట రమేశ్, గోపాలమిత్రులు పెండ్యాల సురేందర్, అనిల్, కుమారస్వామి, ప్రసాద్, ఇస్మాయిల్, సుధీర్, అక్బర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



నారక్కపేటలో పనులను పరిశీలిస్తున్న డీపీవో కల్పన

## పట్టణాలకు దీటుగా పల్లెల్లో అభివృద్ధి

నల్లబెల్లి, అక్టోబర్ 27: పట్టణాలకు దీటుగా పల్లెల్లో అభివృద్ధి పనులు చేపట్టి లక్ష్యాలు సాధించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని డీపీవో కల్పన కోరారు. నారక్కపేటలో శుక్రవారం ఆమె పల్లెప్రగతి పనులను పరిశీలించారు. శ్మశాన వాటిక, నర్సరీ, డంపింగ్ యార్డు, పల్లెప్రకృతి వనం, గ్రామాల సుందరీకరణ పనులను పరిశీలించారు. గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ సిబ్బంది రోజూ పల్లెల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఫాగింగ్, బ్లీచింగ్ పిచికారీ చేయాలన్నారు. ఆమె వెంట ఎంపీవో కూచన ప్రకాశ్, కార్యదర్శి ఎండీ రహీం ఉన్నారు.

## బీఆర్ఎస్ గ్రామ కార్యాలయం ప్రారంభం

నర్సంపేటరూరల్, అక్టోబర్ 27: లక్నేపల్లిలో శుక్రవారం బీఆర్ఎస్ గ్రామ కార్యాలయాన్ని పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జి మోతె పద్మనాభరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గొడిశాల రాంబాబుగౌడ్, ఎంపీటీసీ ఉల్లేరావు రజిత, ఉప సర్పంచ్ పరాచికపు సంతోష్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పొత్కాల కొమ్మాలు, నాయకులు మచ్చిక నర్సయ్యగౌడ్, మోతె జయపాల్‌రెడ్డి, మోటూరి రవి, రాంప్రసాద్, కుమారస్వామి, నాయకులు గొడిశాల అశోక్, రూరల్ మండల సోషల్ మీడియా కన్వీనర్ బగ్గి రాజు, వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సత్యనారాయణ


ఎస్సీ కమిటీ బాధ్యులను సన్మానిస్తున్న నాయకులు

### 'చరిత్రహీనులుగా మారుతున్న కాంగ్రెస్ నేతలు'

ఖానాపురం, అక్టోబర్ 27: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోరుకునే ఆర్థిక అభివృద్ధిని అడ్డుకుని కాంగ్రెస్ నాయకులు చరిత్రహీనులుగా మారుతున్నారని బీఆర్ఎస్ ఎస్సీసెల్ డివిజన్ కన్వీనర్ కల్లెపెల్లి సురేశ్ విమర్శించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం దళితకాలనీల కమిటీ సమావేశాన్ని నేలమారి నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో దళిత వర్గాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. దళితబంధు పథకాన్ని నీరుగార్చేలా కాంగ్రెస్ నాయకులు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి గెలుపు కోసం ఎస్సీకాలనీల్లో ముమ్మర ప్రచారం చేయాలన్నారు. అనంతరం ఎస్సీసెల్ డివిజన్ కమిటీ బాధ్యులను సన్మానించారు. సమావేశంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, కమిటీ సభ్యులు కోట డేవిడ్, శోభన్, బాబు పాల్గొన్నారు.